
# "నీ సన్నిధిలో..."

కథ

వి.ఎల్.వి.భారతి



"ఈరోజు అప్సర రాలేదు" అలా నేను అనుకోటం వెయ్యోసారి. ఆమె రానిరోజు కాలం ఎందుకిలా స్తంభిస్తుంది? ఎటువంటి అలలూ లేని నిశ్చల నదిలా మనసు కూడా ఏ ఆలోచనా లేక స్తబ్దుగా... ఎందుకిలా? ఆమె కనిపించిన రోజు కాలం పరవళ్ళు తొక్కే సెలయేరౌతుంది. ఆమె గురించిన ఆలోచనలన్నీ రెక్కలు తొడిగి వెన్నెల విహారం చేసినంత తియ్యని అనుభూతినిస్తాయి.

అసలుఆమె ఎవరో, ఏంపేరో తెలీదు. ఆ సౌందర్యాన్ని బట్టి నేనూహించుకున్న...కాదు.. పెట్టుకున్న పేరు అప్సర! ఆమె గురించి ఎందుకింత ఆలోచిస్తున్నానో అర్థం కాదు. బహుశా నాపైనాకున్న మమ కారంకంటే ఆ అమ్మాయి మీదున్న వాత్సల్యంఎక్కువని మాత్రం అర్థమైంది. ఎప్పటిలాగే డైరీ తెరిచాను.

అప్సరా!

టైం తొమ్మిదైనా నువ్వింకా రాలేదు. అసలు నువ్వెవరో, ఎక్కడుంటావో, చేసే ఉద్యోగం ఏంటో తెలీదు. కానీ నా ఊహలు మాత్రం ఎప్పుడూ నీ చుట్టూనే! ఇదిగో...ఇలా పై అంతస్తులో ఉండి కిటికీలోంచి ఎదురుగా ఉన్న బస్టాపులో నిలబడ్డ నిన్ను చూసే ఈ ఐదు నిముషాలే నాకు ఆ రోజుకి కావలసిన జీవ చైతన్యాన్ని కొనితెస్తాయి. అవే నా కవిత్వానికి ప్రాణం. ఈ మూగ గుండెలో కోటి రాగాలు వేణువు ద్వారా బయట పడతాయి.

ఝరీ వేగతుల్యమైన భావాలు జలపాతాలై కాగితంపై దూకాలంటే స్పందనలో కరిగే హృదయం ప్రేరణ కావాలి. ఇలా అలలు అలలుగా, తెరలు తెరలుగా కదిలించి కరిగించి నాలో స్పందన కలిగిస్తున్నావెందుకు? కెరటం ఒడ్డుకు చేరాలంటే గాలి వేగం తోడైనట్టుగా నా భావాలు కవితలుగా ఆవిష్కరించబడాలంటే నీ ఊహలు తోడు రావాలి.

అప్సరా! నువ్వురానిరోజు నాకు పిచ్చెక్కినట్టు ఉంటుందని నీకు తెలీదా? ఇదంతా నా వెర్రిగానీ! అసలు నేనెవరో నీకు తెలిస్తేకదా? నా నిరీక్షణ అసలు నీకు తెలిసే అవకాశమేలేదు. రేపైనా వస్తావా? నా నిరీక్షణ ఫలిస్తుందా?

డైరీ మూసి అటు చూసాను. రోజూ అప్సరతో మాట్లాడే కాలేజీ పిల్ల ఒక్కత్తే అక్కడ నిలబడి ఉంది. అక్కడే ఇద్దరూ తెగ కబుర్లు చెప్పుకుంటారు. బస్సు రాగానే ఎవరి దారి వారిది.

ఈ మధ్యాహ్నం ఏ.ఐ.ఆర్.లో ఫ్లూట్ రికార్డింగ్ ఉంది. సాయంత్రం నగరంలోని ఓ ప్రముఖ సంస్థ ఆహ్వానం మేరకు 'వేణునాదం' ప్రోగ్రాం ఇవ్వాల్సి ఉంది. రోజూ మొత్తంమీద ఎంత బిజీగా ఉన్నా అప్సరని చూడలేదన్న ఆలోచనముల్లులా మనసుని గుచ్చుతూనే ఉంటుంది. కాలేజీ పిల్ల వెళ్ళిపోయింది. అప్సర లేని ఆ బస్టాపంతా పెళ్లి కూతురు లేని కళ్యాణ మండపంలా చిన్నబోయింది.

** ** **

అప్సర రానే వచ్చింది. నాచూపులు ఆమె రూపానికి అతుక్కుపోయా యి. నా ఆలోచనలు రెక్కలు తొడుక్కుని నేను చూస్తున్న కిటికీగుండా ప్రయాణించి ఆమె చుట్టూ చేరిపోయాయి. నా చెయ్యి మాత్రం డైరీని తెరిచి దాని పని అది చేసుకుపోతోంది.

అప్సరా!

గులాబీ రేకుల మీద కరిగిన మంచుబొట్టు తనపై రాలాలని వెర్రిగా ఎదురుచూసే ఓ గడ్డిపరకలా నిన్న నీకోసం ఎంతగా నిరీక్షించానో తెలుసా? వర్ణించకుండా సాగిపోయే మేఘం నీ సందేశాన్ని ఏమైనా చిరుజల్లులా నాపైన కురిపిస్తుందని ఆశగా ఎదురుచూసే నావంక జాలిగా చూసింది. అసలు నీ ఆలోచన వస్తే చాలు అంతరంగమంతా ఆనందాల వెల్లువవుతుంది. నీ ఊహలు నా ఎన్నో రోజుల్ని అర నిముషంలా మార్చేస్తున్నాయి. ఈ ఆనందానికి ఆయుష్షు తక్కువని నాకు తెలుసు. అయినా కలకాలం సొంతం కావాలని కోరుతోంది వెర్రిగా... ఆశగా...!

ఈరోజు కొత్త చీర కట్టావు. ఆ చీర కుచ్చిళ్ళ కొసలది ఎంత అదృష్టం. నీ హంస నడకతోపాటు అవీ వయ్యారాలు పోతూ ఒకసారి ఈ పాదాన్ని మరోసారి ఆ పాదాన్ని ముద్దు పెట్టుకుంటున్నాయి. నీ నీలి ముంగురులకి ఎందుకంత ఆరాటం? నీ చెక్కిళ్లని స్పృశించాలని! గాలి సహకారాన్ని తోడు తెచ్చుకుని తమ ఉనికి నుదుటి వరకే పరిమితమని తెలుసుకుని ఆ పాటి అదృష్టానికి మురిసిపోతూ అటూ ఇటూ ఊగుతున్నాయి.

నువ్వురాని రోజు ఏకాంతంలో లెక్క పెట్టుకున్న ఎన్నో ఘడియలు నన్ను చూసి జాలిగా నవ్వుకుంటూ ఎలా సాగిపోయాయో నీకు ఎలా వివరించను?

ఉప్పొంగే సాగరానికి ఆవలి తీరాన నువ్వు! నీ నిరీక్షణలో కుంగిపోతూ ఈవల నేను! నింగీ నేలా చూస్తూనే ఉన్నాయి. కాలమనే కెరటాలు సాగిపోతున్నాయి. ఈ దూరాన్ని చెరిపేసే చెలిమి వారధి ఎప్పుడు కడతావు? నీ చల్లని చెలిమి చిరుగాలి తగిలి మమతల చినుకులు వర్షించడం కోసం నేను ఓ మబ్బు తునకనై ఎన్ని యుగాలైనా నిరీక్షిస్తూనే ఉంటాను.

అప్సర వెళ్లిపోయింది. డైరీలో ప్రవహించే నా భావ స్రవంతులన్నీఆగిపోయి తీరాన్ని ఢీకొట్టి వెనక్కి మళ్లే కెరటాలయ్యాయి.

** ** **

అక్క దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. అవతలివారి మాటలు వినడం తప్ప జవాబివ్వలేని మూగవాడిని నేను. అయితేనేమి? గుండెలో భావాలని తీయని రాగాలుగా వేణువు ద్వారా పలికించే శక్తి దేవుడిచ్చాడు. ఫోనులో అక్క "విడిగా ఉండడం ఎందుకు? తమతోపాటు ఉండమని ఒకటే పోరు. కానీ నేను ఏకాంతాన్నే ప్రేమిస్తాను. అందులోనే నా కథలకి తగిన వస్తువు దొరుకుతుంది. నా కవితలకి ఊపిరులు పోసే భావ స్రవంతులు మదిలో తలెత్తుతాయి.

మనసు ఆనంద పరవశమైనపుడు గానీ, దుఃఖం కలచివేసినపుడు గానీ ఏ మూలనో దాగున్న కుంచె ఎగిరొచ్చి నా చేతుల్లో వాలి ఆనంద విషాదాలని ఏదో రూపంలో ఆవిష్కరిస్తుంది. ఈ ఏకాంతంలోనే అప్సర తో డైరీలో నా భావాలు పంచుకుంటాను. నా ఆవేశాన్నంతటినీ ఊపిరిగా మార్చి ఎంతసేపైనా వేణువూదుకుంటూ నన్ను నేను మరిచిపోతాను. కళ్లల్లో నీళ్లు ఉప్పొంగేదాక!

** ** **

అప్సరా! నా సర్వస్వం నీ సమక్షాన్నే కోరుతోంది. నీ ఉ నికి లేనపుడు నాలో ఆలోచనలు శూన్యం. హేమంతపు చలి ఎంతగా వణికిస్తున్నా నీ తీయని ఆలోచనలు నాలో వెచ్చదనాన్ని నింపుతున్నాయి. ఒక ప్రశ్న మాత్రం నిత్యం నన్ను వేధి స్తూనే ఉంది. నీపట్ల నాకున్నది కేవలం ఆకర్షణా? అభిమానమా? ఇష్టమా? ఆప్యాయతా? ఆరాధనా? వీటన్నింటినీ మించిన ప్రేమా...? ఏమో?! నేను ఏదీ తేల్చుకోలేను. కానీ ఇదంతా వన్‌వే ట్రాఫిక్ అని మాత్రం తెలుసు. అయి తేనేమి? ఎవరికీ ఇబ్బందికరం కానివి నాకనందాన్ని ఇచ్చేవైన ఈ ఊహల్లోని అనుభూతుల్ని నేనెందుకు

వదులుకోవాలి? చెప్పు! అప్సరా! నేను తప్పు చేస్తున్నానంటావా?

నిన్న...ఉద్భుతమయ్యే నీ ఆలోచనల్ని తట్టుకోలేక చాలా కాలం తర్వాత కుంచె చేత బట్టాను. నీ చిత్రం అద్భుతంగా వచ్చింది. అచ్చు నువ్వు నా ఎదురుగా ఉన్నంత అనుభూతి. రెప్పవెయ్యకుండా నీ కళ్లల్లోకి సూటిగా చూస్తూ నీ కనుపాపల్లో నా రూపాన్ని చూసుకుందామంటే అందులోనూ నువ్వే కనిపించావు. ఎందుకో తెలుసా? నాలో ఉన్నది నువ్వేగా మరి!

** ** **

అప్సరా! వెడ్డింగ్ కార్డు అనుకుంటా! [illegible] వైపులా పసుపు రాసి ఉంది. దాన్ని కాలేజీ [illegible]ల్ల చేతికిచ్చావు. అంటే...నీకు పెళ్లి సెటిలైందన్నమాట. ఈరోజునుడి కంటికి ఇక కనిపించవా? ఏ ఊరో వెళ్లిపోతావా? నిత్యం నువ్వు నా కళ్ల ముందు ఉండాలన్నది అత్యాశేమో! అందుకే దేవుడు ఇలా చేసాడు. కొద్ది రోజుల్లో నువ్వు పరాయిసొత్తుకావచ్చు. కానీ నా ఊహల్లో మాత్రం నీ రూపం చెరిగిపోదు. నీపట్ల నా భావం మారదు. కానీ నువ్వు దూరమవుతున్నా వన్న ఊహే నన్ను అతలాకుతలం చేస్తోంది. నా గురించి నీకు తెలియజేసే క్షణం ఈ జీవితంలో రాకపోవచ్చు. అందుకే నాభావ స్రవంతులన్నీ ఇలాడైరీలోనే అణగారిపోనీ! ఈ మూగ మనసు ఘోష ఇక నీ చెవులకి ఎన్నటికీ చేరదులే!

** ** **

వారంపాటు అప్సర రాలేదు. ఈ పాటికి ఆమెకి పెళ్లయి ఉంటుంది. అయినా అలవాటు పడ్డ ప్రాణం సరిగ్గా ఆ టైముకే కిటికీని ఆశ్రయిస్తోంది. అదిగో! అప్సర రానే వచ్చింది. ఆమె రూపంలో ఏదో తెలీని హుందాతనం. కళ్లు వింతకాంతితో మెరుస్తున్నాయి. చెక్కిళ్లు కెంపులనద్దుకున్నాయి. మెడలో పచ్చని మాంగల్యం. మెత్తని పాదాల మునివేళ్లపై కొంత [illegible] రంగా, కొంత సాంప్రదాయ నేపథ్యంగా ఒదిగిపోయిన మట్టెలు...ఏదో అపురూప దృశ్యాన్ని సాక్షాత్కరింపజేస్తున్నాయి.

నా చేతులు అప్రయత్నంగా డైరీనందుకున్నాయి.

అప్సరా! ఎన్నాళ్లకి కనిపించావు? ఎదురుచూసి చూసి అలసిన భక్తునికి ప్రత్యక్షమైన దేవతలా... ఔను! నువ్వు నా పాలిటి దేవతవే! ఆ దేవతపట్ల పవిత్రమైన ఆరాధన తప్ప మరే భావంరాదు. ఉండదు. మీ వైవాహిక బంధం అలవోక గా ఆలపించే అమృత రాగధార కావాలి. అది గ్రీష్మాలకీ, శిశిరాలకీ బెదరక నవవసంతస్వాదనానందనమవ్వాలని. అది ఆనందాల తేనెలవాకై, సుమ సౌర భావలను మోస్తూ అవిరళంగా సాగిపోతూ, నిండునూరేళ్లు తరించాలని మనసారి కోరుకుంటున్నాను.

** ** **

ఇకరాదనుకున్న అప్సర రోజూ వస్తూనే ఉంది. కానీ క్రమంగా ఆమెలో ఏదో [illegible] స్పష్టంగా! చిరునవ్వు మాయమైంది. కళ్లల్లో కాంతి, మెరుపు తమ ఉనికి కోల్పోతున్నాయి. చందమామలాంటి ఆ మొహాన్ని ఏదో దిగులు, నిర్లిప్తత మేఘాలు కమ్మేసాయి. కాలేజీపిల్ల పలకరించినా ముభావంగా ఉంటూ...చూపులు శూన్యాన్ని మోస్తూ... ఎందుకలా ఉంది? మునుపటి ఉత్సాహం ఏమైంది?

అప్సరా! నీ బాధ ఏంటో చెప్పవూ? నిన్ను చూస్తుంటే గుండెనెవరో మెలి తిప్పినంత బాధ! నా మనసంతా స్తబ్దత...జడత్వం!

ప్లీజ్ మళ్లీ చిరునవ్వు ఎగిరొచ్చి నీ అధరాల [illegible] కళ్లల్లో మెరుపు నిత్యమై [illegible] నేను చెయ్యగలను?

[illegible] పలకరింపుకుని రాగాలాపన మొదలెట్టాను. అలా ఎంతసేపు ఉన్నానో తెలీదు. ఎవరో తలుపు కొడుతుంటే అయిష్టంగానే లేచివెళ్లి తలుపు తీసాను.

ఆశ్చర్యం! ఎదురుగా కాలేజీ పిల్ల. మా అక్కతో! లోనికి ఆహ్వానించాను.

ఆ కాలేజీ పిల్ల అక్కవాళ్ల పక్కింటి బంధువుల అమ్మాయని, ఇద్దరికీ ఎప్పటినుంచో పరిచమేననీ. షాపింగుకని వచ్చి అట్నుంచి నన్ను చూడానికి వచ్చారని చెప్తూ ఆ అమ్మాయి పేరు రమ్యనీ పరిచయం చేసింది. అప్పుడు గ్రహించాను. ఆపిల్ల దృష్టి నావైపు కాక నేను పెయింట్ చేసిన అప్సర చిత్రం మీద ఉందని. ఆమె మొహంలో ఆశ్చర్యం. అది గ్రహించి అక్క నా గురించీ, అప్సరపట్ల నా భావాలను చూచాయగా చెప్పింది.

రమ్యద్వారా చాలా విషయాలు తెలిసాయి. అప్సర అసలుపేరు సుచిత్ర అనీ, భర్త పరమ దుర్మార్గుడు, పచ్చి తాగుబోతనీ, మంచి ఉద్యోగమని అబద్ధం చెప్పి పెళ్లి చేసుకున్నాడనీ, ఈమె జీతంమీద ఆధారపడి కూడా ప్రతి చిన్న విషయానికీ గొడవ పేస్తూ, విసిగిస్తూ వేధిస్తూ శారీరక-మానసిక హింసలకి గురి చేస్తాడని చెప్పింది. అప్పటిగ్గానీ తెలియలేదు అప్సర మొహం మబ్బులు పట్టిన చందమామలా ఎందుకు మారిందో! ఆమె జీవితం ఇలా అయినందుకు మనసు కకావికలమైంది.

** ** **

యధాలాపంగా కిటికీ దగ్గర కూర్చుని అటువైపు చూస్తున్న నేను ఉలిక్కిపడ్డాను. రమ్య సుచిత్రకి ఏదో చెప్తూ నావైపు చెయ్యెత్తి చూపిస్తోంది. ఆమె నాకేసి అదోలా చూసింది. నేనెందుకో ఇబ్బందిగా ఫీలయ్యాను. అక్కడ్నుంచి లేవాలనిపించింది కానీ ఆ పని చేయలేకపోయాను. ఆరోజే కాదు... ఇక ఇద్దరికీ ఆ ఐదు నిమిషాలు అలా ఒకరినొకరం చూసుకోటం [illegible] భాగంగామారింది. ఇలా ఎంతో కాలం సాగలేదు. ఆమె మళ్లీరావటం మానేసింది. దాదాపు పదిహేను రోజులు! నాకు పిచ్చెక్కినట్టుంది. ఆమెనుండి నేను ఆశించేది ఏమీలేదు. అయినా ఆ ఐదు నిమిషాలు నా కళ్లముందు నిలబడితే చాలు నా ప్రాణాలు నిలపడానికి.

నన్నీ ఆలోచనల నుంచి తప్పించటానికన్నట్లు ఓ రోజు అప్సర వచ్చింది. నుదుటిపై కుంకుమ లేదు. మొహం దుఃఖంతో వివర్ణమైంది. హతాశుడినయ్యాను. ఆమె చిక్కిసగమైంది. నా మనసు విలవిల్లాడింది. విషాదం గుండె తలుపు తోసుకుని ప్రవేశిస్తూంటే డైరీ తెరిచాను.

అప్సరా! నీకెంత అన్యాయం జరిగింది? మూడు పదులన్నా నిండని నీ జీవితం ఇలా మోడువారాలని రాసాడా ఆ భగవంతుడు. ఇక నీ బతుక్కి వసంతమే లేదా? ఇదివరకటి నా అప్సరని చూడటం సాధ్యం కాదా?

ఎన్నో ఆలోచనలు నా డైరీలోని ప్రతీ పేజీని విషాదంతో తడిపేస్తున్నాయి. బొట్టులేని ఆమె రూపాన్ని చిత్రిస్తున్న నా చేతులు వణుకుతున్నాయి. కళ్లు కన్నీటి చెలమలవుతున్నాయి.

** ** **

రోజూ అప్సర నన్ను చూస్తూనే ఉంది. కుంకుమ లేని ఆ మొహాన్ని చూసిన ప్రతిసారీ నా గుండె బద్దలవుతూనే ఉంది. అప్సరా! ఒక్కసారి మాట్లాడు. నీ విషాదాన్ని నాతోపంచుకోవూ? నిన్ను ఆదుకునే ఆప్తుడ్ని నేనున్నాను. నీ కన్నీళ్లని నా కళ్లల్లో దాచుకుంటాను. నీబాధా, నిట్టూర్పులు గాలి అలలపై తేలివచ్చి నా హృదయాన్ని సూటిగా గుచ్చుతున్నాయి.

భరించలేని ఉద్వేగాన్ని అదుపులో పెట్టలేని ఆలోచనలవల్ల నేను ఎప్పుడోఒకప్పుడు రెక్కలు కట్టుకుని నీ ముందు వాల్తాను. అప్పటికీ నువ్వు పలక్కపోతే...నీ మౌనాన్ని నా హృదయంలో నింపుకుని అక్కడ్నుంచి కదిలిపోతాను ఎక్కడికో!

** ** **

రోజులన్నీ భారంగా గడుస్తున్నాయి. నా మనసు ఆమె ఆలోచనల్నుంచి విడివడటం లేదు. కాలం ఎప్పుడూ ఒక్కరీతిగా నడవదు. ఎవరిని ఎప్పుడు కలపాలో



ఎప్పుడు విడదీయాలో దానికి బాగా తెలుసునని ఆరోజు జరిగినసంఘటన ఋజువు చేసింది.

ఎప్పటిలాగే కిటికీ దగ్గర నేను...బస్టాపులో ఆమె...!

ఇంతలో మతోన్మాదం విజృంభించి మారణ హోమంగా రూపుదాల్చి రోడ్డుపై ఒక్కసారిగా స్వైర విహారం చేయసాగింది.



పోలీసులొచ్చి ఆగటం సైరను మోతలూ, మైకులో హెచ్చరికలూ... కనిపించిన వారిపై లాఠీ చార్జీలు...అన్నీ క్షణాల్లో జరిగిపోతున్నాయి. జనం ప్రాణ భయంతో తోచిన దిక్కుకి పరుగు దీస్తున్నారు. నేను కిటికీలోంచి ఇదంతా దిగ్భ్రాంతిగా చూస్తున్నాను. చెల్లాచెదురై పరుగుదీసే జనం... వారిని వెంటపడి తరుముతున్న పోలీసులు వీళ్లందరి మధ్యనుంచీ నాకళ్లు అప్సరని వెతుకుతున్నాయి. ఆమెఒక్కక్షణం మెరుపు తీగలాకనిపించి అంతలోనే మాయమవుతోంది.

"ఈ బీభత్సకాండనుండి ఆమెను ఎలాకాపాడాలి? నాలోఆతృత! ముష్కర మూకలు పోలీసులపై, జనాలపై విసిరే రాళ్లల్లో ఒకటి విసురుగా కిటికీ గుండా వచ్చి నా నుదురుతాకింది. మరో రాయి కిటికీ గాజు తలుపుని బద్దలు కొట్టింది. గాజు పెంకులు గదినిండా చెల్లాచెదురుగా పడ్డాయి.

దెబ్బవల్ల నా తల తిరిగిపోతోంది. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. రక్తం లావాలా సర్రున పైకి చిమ్మి కళ్లమీదుగా జారి బుగ్గపైకి ప్రవహిస్తోంది. చెవుల్లో హోరుమని ఒకటే శబ్దం!

విరిగిపోయేటంత తీవ్రంగా ఎవరో తలుపులు బాదుతున్నారు. మూసుకుపోతున్న కళ్లని బలవంతంగా తెరిచే ప్రయత్నం చేస్తూ, తప్పిపోతున్న స్పృహని ప్రయత్నం మీద అదిమిపెడ్తూ... తడబడే అడుగులతో వెళ్తున్నాను తలుపులు తెరవటానికి. పగిలిన గాజుపెంకులు నా అరికాల్లో కసిగా దిగబడ్డాయి. అలాగే కుంటుకుంటూ వెళ్లి తలుపు తీసాను.

ఆశ్చర్యం! నా ఎదురుగా అప్సర! నిలువెల్లా చిగురుటాకులా వణికిపోతూ నిలబడి ఉంది.

అంతే! నా కనురెప్పలు వాలిపోయాయి. నేను స్పృహ త...ప్పి...పో...యా...ను...!

** ** **

నాకు మెలకువ వచ్చేసరికి మంచంపై ఉన్నాను. పక్కనే అప్సర నిలబడి ఆత్రంగా నా మొహంలోకిచూస్తోంది. నేను చిన్నగా నవ్వాను. లేచి కూర్చునే ప్రయత్నం చేస్తూంటే వద్దని వారించింది. మంచి నీళ్లు కొద్దికొద్దిగా నా నోట్లోకి వంపుతూ తాగించింది.

కలా...! నిజమా...! ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో నేను!

"మీ అక్కకి ఫోన్ చెయ్యమంటారా?" ఎదురుగా డ్రెస్సింగు టేబుల్ అద్దంలో తలకీ, కాలుకీ కట్టుకట్టి ఉన్న నా రూపాన్ని చూసుకుంటుంటే ప్రశ్నించింది.

వద్దన్నట్లు తల అడ్డంగా ఊపాను.

చొరవగా తనే వంటింట్లోకి వెళ్లి కాఫీ తయారు చేసి పట్టుకొచ్చింది. నేను నిదానంగా లేచి కూర్చున్నాను. పగిలిన గాజు పెంకులు ఏరేసి శుభ్రం చేసింది కాబోలు గదంతా కడిగిన ముత్యంలా ఉంది. కిటికీలోంచి బైటికి చూసాను. అలజడి కాస్త సద్దు మణిగింది. పోలీసులు అక్కడక్కడా గస్తీ తిరుగుతున్నారు.

"మా అన్నయ్యకి ఫోన్ చేసాను. కాసేపటికి ఇక్కడికి రావొచ్చు" నా ఆలోచన గ్రహించి తానే జవాబు చెప్పింది నేను వేసిన తన చిత్ర పటాన్ని తదేకంగా చూస్తూ!

నేను పెన్నూ, పేపరూ తీసుకుని రాయడం మొదలుపెట్టాను.

"సుచిత్రా!

దయచేసి ఇది చదివి నన్ను అపార్థం చేసుకోకు.ఏ పరిచయం లేకుండానే నీ పట్ల ఎంతో అభిమానాన్ని, ఆరాధననీ పెంచుకున్నాను. నీకు పెళ్లని తెలిసాక కూడా నా భావనలో మార్పులేదు. నిన్ను మనసులోనే ఆస్వాదించాను. కానీ విధి వక్రించింది. నిన్ను సుఖసంతోషాలకి దూరంచేసింది.

నీకు తెలీదు. నువ్వు బస్టాపులో కనిపించని రోజు నిద్రాహారాలకి దూరం. క్షణమైనా వీడని నీ ఆలోచనలు నన్ను అతలాకుతలం చేస్తాయి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ఎదురుగా ఉండాలన్నది నా స్వార్థమే. నా ఊహల్లో ఎప్పుడూ నీతోనే విహరించాను. నీతో మనసారా మనసు విప్పి మాట్లాడలేని అశక్తుడిగా ఆ భగవంతుడు నన్ను సృష్టించాడు. అందుకే ఈ డైరీ చదువు నీకే అర్థమవుతుంది. రమ్య నా గురించి నీకు కొంతైనా చెప్పి ఉంటుంది. నీ గురించి ఏమీ తెలియని నేను ఇంత అనుబంధాన్ని పెంచుకోడం నీకు వెర్రిగా అనిపించవచ్చు. అయినా సరే నా పిచ్చి నాకానందం. నీ పట్ల నాకున్న అభిమానం, ఆరాధన, ఆప్యాయత, మమకారం నాలో రాగాల్ని మీటాయి. మనసు వీణ తీగల్ని సవరించాయి. నా దృష్టిలో నువ్వో దేవతవి. నేను నీ భక్తుడిని. ఆకాశమంతటి ఉన్నతమైన నీ ముందు నీ స్నేహానికై మోకరిల్లుతున్న గడ్డిపూవుని నేను. అలా జీవితమంతా నీ సమక్షంలో గడపడమే నాకానందం.

నిన్ను విషాదం నుండి తప్పించి నీ బాధలు మర్చిపోయేలా సాంత్వన చేకూర్చాలన్నది నా తపన.

నాలో క్షణక్షణానికీ పెరుగుతున్న టెన్షన్నీ, ఈ అస్థిమితాన్నీ తట్టుకోడం కోసం ఫ్లూటు తీసి రాగాలాపన మొదలెట్టాను. దానిలో సమయాన్నే కాదు, నన్ను నేనే మర్చిపోతూ ఏదో తెలియని పారవశ్యంలో మునిగి తేలుతున్నాను.

మన ఈ అనుబంధానికి ప్రత్యేకమైన అర్థం అంటూ ఉండకపోవచ్చు. కానీ అది నిరర్థకమైంది మాత్రం కాదు. సమాజపరంగా అది ఆమోదానికీ అర్హం కాకపోవచ్చు. ఇందులో భౌతిక ప్రయోజనం ఉండకపోయినా ఇరువురికీ అంతకు మించిన ఆనందం మాత్రం ఖచ్చితంగా ఇచ్చి తీరుతుంది. దీనికి నువ్వు ఔనన్నా, కాదన్నా నా ఊహల్లో పడి నేను కొట్టుకుపోతానే తప్ప నీ ఆలోచనల నుండి విడివడలేను.నా ఆలోచనలు మరొకరికి ఇబ్బంది కలిగించనంత వరకూ అవి నాకు మానసిక తృప్తి, ఉత్సాహాన్ని అందిస్తున్నప్పుడు నేనెందుకు సందేహించాలి? ఎవరికి భయపడాలి?

నీ జీవితంలో మళ్లీ వసంతం చిగురించాలనీ, అది నీ నుదుటి తిలకమై మెరవాలనీ కోరుకోటం దురాశ మాత్రం కాదు కదా!

ఈ ఉత్తరం, డైరీ చదివాక ఈ దీనుడిపై ఏమాత్రం కనికరం కలిగినా అది ఎంతో అదృష్టంగా భావిస్తాను.

ఏం నిర్ణయించుకుంటావో నీఇష్టం. నా జీవితాన్ని నీ పాదాల ముందుంచి నీ అనుమతి కోసం వేచి ఉన్నాను. నీకు తెలియకుండానే నీపట్ల ఇంత అనుబంధాన్ని పెంచుకున్నందుకు నీకు ఆగ్రహం కలిగితే నీకు తోచిన రీతిలో శిక్షించు. ఆనందంగా భరిస్తాను. కానీ నీతో సహ చర్యమనే అదృష్టాన్ని నాకు కలిగించమనీ, అందుకోసం ఎన్ని యుగాలైనా ఇలాగే నిరీక్షిస్తాననీ దైవసాక్షిగా చెబుతున్నాను. వీలైనంత త్వరలో నీ నిర్ణయం తెలియజెస్తావు కదూ! నీ అనుమతి కోసం వేచి ఉన్న...నీ శరత్!

వెళ్లిపోయేటప్పుడు ఆ ఉత్తరాన్నీ, డైరీనీ ఆమెకు అందించాను మౌనంగా!

** ** **

అప్సర నిర్ణయం ఎలా ఉంటుందో అన్న టెన్షన్ భరించరానిదిగా ఉంది. రాత్రంతా కంటిపై కునుకు లేదు. తెల్లారింది. గోడ గడియారంలో చిన్నముల్లు ఎప్పుడూ లేనంత అతి నిదానంగా కదుల్తోంది. సెకన్ల ముల్లు పెద్ద ముల్లును ఎప్పుడెప్పుడు తొమ్మిదికి చేర్చుదామా అని ఆరాటపడుతోంది నా మనసులాగే!

నాలో క్షణక్షణానికీ పెరుగుతున్న టెన్షన్నీ, ఈ అస్థిమితాన్నీ తట్టుకోడం కోసం ఫ్లూటు తీసి రాగాలాపన మొదలెట్టాను. దానిలో సమయాన్నే కాదు, నన్ను నేనే మర్చిపోతూ ఏదో తెలియని పారవశ్యంలో మునిగి తేలుతున్నాను.

అప్సరపట్ల గల నా అభిమానం, ఇష్టం, ఆరాధన అంతా ఊపిరిగా మార్చి 'నా మది నిన్ను పిలిచింది గానమై వేణూ...గానమై...నా ప్రాణమై" గీతాన్ని వేణువుపై ఆలపిస్తున్నాను.

పాట పూర్తయ్యేటప్పటికీ నా పాదాలపై ఏదో బరువుగా ఉన్నట్లు అనిపించి కళ్లు తెరిచాను.

ఆశ్చర్యం! అప్సర ఎప్పుడు వచ్చిందో తెలీదు. నా పాదాలపై వాలిపోయి ఉంది. ఆమె వెచ్చని కన్నీళ్లు నాపాదాలని అభిషేకిస్తున్నాయి.

సంభ్రమంగా, అప్రయత్నంగా నా పాదాలని వెనక్కి తీసుకుని ఆమెని లేవనెత్తాను. "ఈ కళ్లు ఆనందంతో మెరవాలే తప్ప... కన్నీళ్లతో కాదు" మనసులో అనుకుంటూ ఆమె కళ్లు తుడిచాను.

నేను పుట్టినప్పటినుంచీ మూగవాడినని ఎప్పుడూ బాధపడలేదు. కానీ ఇదిగో ఇప్పుడు ఆ ఒక్కమాటా పైకి అనలేని నా అశక్తతకి దుఃఖం పొంగుకొస్తోంది. అయినప్పటికీ అంతటి భావాన్నీ కళ్లల్లో నింపుకుని సూటిగా చూసాను.

నా సందేశం ఆమెకు చేరిందన్న గుర్తుగా ఆమె నా చేతుల్ని తన చెక్కిళ్లకి ఆనించుకుని కిలకిలా నవ్వింది.

మళ్లీ మా జీవితాల్లోకి వసంతం ప్రవేశించదనడానికి నిదర్శనంగా ఎక్కడో కోయిల కూసింది. అది ఇప్పుడు మా ఇద్దరి హృదయాలకీ మరింత మధురంగా వినిపిస్తోంది.